విశ్వనాథ గణపతిరావు

# గాలి

అ మాయకంగా నిద్రపోతున్న పల్లెలో ఏదో గుడిసెలో గుప్పుమని నిప్పంటుకున్నట్టు, ఊరి నడిబొడ్డులో ఉన్న కుమ్మీగాడి గుడిసెలోనుంచి భుగభుగమని ఊరు ఊరంతా పాకేసింది...

ఏమిటి?......

నిప్పు కాదు. నిప్పుకన్నా ఘోరమైన వార్త. వార్త వింటూనే జనం అదిరిపోయారు, బెదిరిపోయారు. బెంగపడిపోయి గుండెలు బాదుకున్నారు. బాదుకుని పరుగు పరుగున కుమ్మీగాడి గుడిసెకు చేరుకున్నారు, అప్పటికే పొలాలలో కూలిపనికి వెళ్ళిపోయిన కొందరు.

తెలతెల్లవారుతుండగానే ఇంత ఘోరమైన వార్తా?...

ఎంత విపరీతమైన వార్త!

ఇంత విపరీతమైన వార్త ఈ ఊరు పుట్టి పెరిగి ఇన్నాళ్ళయినా ఏనాడూ విని ఎవరూ ఎరుగరు. ఈ ఊరేకాదు, ఈ చుట్టుపక్కల ఏ పల్లెలో కూడా వినలేదు. అందుకే అదిరి, బెదిరిపోయారు. బెంగపడి బేజారెత్తిపోయారు.

ఎంత ఘోరం జరిగిపోయింది!

పుట్టి మూడు మాసాలయినా పూర్తిగా నిండని కుమ్మీగాడి కూతురు, పాతిక రూపాయలిచ్చి ఆదివారం సంతలో కొన్న కోడిపుంజు ఒకేసారి చనిపోయాయి. ఈ వార్త ఊరిలో జనాలను దిగ్భ్రమ చెందించి, భయభ్రాంతుల్ని చేసింది.

గుడిసె ముందు మాసి, చిరుగులు పడ్డ గుడ్డలమధ్య నిర్జీవంగా పడివున్న పసికందు మీద పడిపడి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూంది కుమ్మీగాడి పెళ్ళాం నీలమ్మ. నీలమ్మ ప్రక్కనే కూర్చున్న ఇరుగు పొరుగు ఆడోళ్ళు ఓదారుస్తున్నారు ఆమెను. కాని ఆమె వినిపించుకోవడం లేదు. కన్నీరు కారుస్తునే ఉంది. కన్నీరు కారుస్తున్న ఆమె కళ్ళు ప్రత్తికాయల్లాఅయిపోయాయి.

నీలమ్మ నీళ్ళు పోసుకున్నప్పుడు ఊరు అమ్మోరికి మొక్కుకుంది - 'ఈసారైనా ఆడపిల్ల పుడితే పండక్కి ఘటమెత్తుకుని ఊరంతా తిరుగుతానని'. మొదటి కానుపు దగ్గర నుండి మొక్కుతున్నా అమ్మోరికి కనికరం కలగలేదని సరిపెట్టుకుంది. ఈసారి ఘటమెత్తు కుంటానని అన్నందుకే, నాలుగో కానుపుగా ఆడపిల్ల పుట్టిందని పొంగిపోయింది నీలమ్మ. కాని... ఏది, ఆ ఆనందం మూన్నాళ్ళ ముచ్చటలా, మూడునెలల ముచ్చటైపోయింది. ఏమయిందో తెలియకుండా తెల్లారేసరికి కళ్ళు మూసేసింది. •

"ఎర్రి తల్లి! బంగారు తల్లి. కలల పంటైన అమ్మోరి పెసాదం," అని తలపోస్తూ రాగాలు తీసి ఏడుస్తూంది నీలమ్మ. నీలమ్మను ఓదార్చ



డం ఎవరి వల్ల కావడంలేదు.

కుమ్మీగాడు గుడిసెకు ప్రక్కగా ఉన్న ఎర్రమట్టి దిమ్మమీద కూర్చున్నాడు, విచారంగా! దుఃఖాన్ని ఎంత అదిమి పెడుతున్నా ఆపుకోలేకపోతున్నాడు. వాడి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. వాడి ప్రక్కనే, గుడిసెలోకి వెళ్లడానికున్న ద్వారం దగ్గరే కోలబుట్టలో కోడిపుంజు చచ్చిపడివుంది.

వచ్చేజనం ఆ కోడిని, పసిపిల్లని చూసి "అయ్యో!" అని వాళ్ళముందే అంటుంటే, వాళ్లలో ఉద్వేగం కాస్త ఎక్కువై పొంగి పొరల సాగింది.

"ఏమయింది?..."

"అసలేం జరిగింది?..."

"ఇంత ఘోరం జరగడానికి కారణమేమిటి?..."

....ఇవి అక్కడి జనాల మధ్య పుట్టిన ప్రశ్నలు.

ఇంతలో పక్కూరునుంచి సూదిమందు డాక్టర్ రావడంతో అతడ్ని కొందరు పిలిచి అక్కడ జరిగిన విషయాన్ని చెప్పి చూపించారు.

గుడ్డల మధ్య నల్లబల్లిలా ఉన్న ఆ పిల్లను చూసి, కనీసం ముట్టుకోకుండానే చూపులతో లెక్కవేసి, "చనిపోయింది" అని చెప్పి వెళ్ళిపోయాడా డాక్టర్!

"అసలేమయిందిరా కుమ్మీ! రాత్రి పిల్లకేమైనా సుస్తీసేసిందా?" అని అడిగాడు కుమ్మీ ప్రక్కనే కూర్చున్న వాడి స్నేహితుడు పోలిగాడు.

ఈ మాట విన్న నీలమ్మ ఇటు తలతిప్పి, పోలిగాడ్ని చూసి, "ఏ సుస్తీనేదురా అన్నా! రాత్రి తొంగుండేవరకూ ఆడుకుంతానే ఉంది. ఆ తరవాతే నాను తొంగున్నాను. తెల్లారగట్టే సూసుకుంతే ఇంకేవుంది. గోరం జరిగిపోనాది... ఇంతలోనే ఏ మాయ గాలొచ్చి నొక్కేసినాదో నా బంగారు తల్లిని!"... అంటూ మళ్లా ఏడుపందుకుంది.

అంతే!...

గాలి...

మాయగాలి...

మహమ్మారి గాలి...

ఇలా అక్కడి కొచ్చిన వాళ్ళలో ఒక్కొక్కళ్ళ నోట్లో నుంచి ఒక్కొక్క గాలి పుట్టుకొచ్చాయి.

"...సంటి పిల్లల్ని పొద్దుపోయినకాడినుంచి పువ్వు నాగ సూసుకోవాలి, మనం నిద్దర మానీసైనా సరే! నేకపోతే ఏ సెనాన గాలొచ్చి ఆ సిన్న పేనం మీద పడతాదో సెప్పనేం!" అంటూ ఎంతోఅనుభవం ఉన్నట్టు చెప్పింది, నలభై ఏళ్ళొచ్చినా ఇంకా పిల్లలు పుట్టని ఈరేసమ్మ.

"అవునవును! సిన్న పేనం. సటుక్కున ఆరిపోద్ది. మాయగాలి ఒక్కొక్కపాలి పెద్ద పేనాలని కూడా, సూసుకోకపోతే గుటుక్కుమనిపించేత్తాది..."అంది మొగుడు తాగి తాగి వస్తే, గాలి మీదపడి చంపేసిందని ఊరంతా చెప్పుకు తిరిగిన ఆదెమ్మ!

వీళ్ళ మాటలు విన్న కుమ్మీగాడి అయ్య, పైడయ్య... కొడుకునీ, కోడల్నీ మార్చి మార్చి చూసి కోపంగా అన్నాడు:

"పిల్లల్ని కనగానే సరికాదు. ఎయ్యికళ్లెట్టే సూసుకోవాల. అద్దర్రేతిరి ఒరకూ ఊరిమీద తిరిగొత్తే, ఎంటొచ్చిన మహమ్మారి గాలులు ఊరుకుంతాయేటి?... ఇట్టాగే నొక్కి పారేత్తాయి..."

తన అయ్య అన్న ఆ మాటలు, తన నుద్దేశించే అన్నాడని గట్టిగా ఫీలయ్యి తల పౌరుషంగా. ఎగరేశాడు కుమ్మీగాడు.

"ఎవిడెయ్! ఊరిమీద తిరగుతన్నాడు?" అన్నాడు.

చెవిలో దోపివున్న చుట్టను తీసి నోట్లో పెట్టుకోబోతున్న పైడయ్య, చుట్ట చివర కటుక్కున కొరికి నోట్లో కొచ్చిన ముక్కను తుపుక్కున ఊసి, కొడుకు ముఖంలోకి కొరకొర చూసి, "రాత్రి నాను పొలంకాపు కెలుతుంటే నువ్వు ఎక్కడ ఎదురయ్యినావురా నాకు?... ఆ సాసేనాల కివతల మదుంకాడ పోలయ్యగాడితో మాటాడుతున్నావా?... అంత రాత్రి అయ్యే వరకూ అక్కడ నీకేటిరా పని?! మళ్లా పెద్ద కబుర్లాడతన్నావు?..." అంటూ దులిపేశాడు కొడుకుని.

కుమ్మీగాడు ఏమీ మాట్లాడలేకపోయాడు. రాత్రి స్నేహితులతో కలిసి పక్కూరు పండక్కి వెళ్ళి తిరిగొస్తున్నప్పుడు అయ్య చూసుంటాడని ఇప్పుడు తెలుసుకుని నోరు మూసేసుకున్నాడు.

"అదిసరే! మీరిప్పుడు దెబ్బలాడుకోడానికిది సమయం కాదు. జరగాల్సిందేదో సూడండి" అన్నాడు వీళ్ళ మాటలు వింటున్న లోకేసు.

చటుక్కున తల ఎత్తి లోకేసువైపు చూశాడు పైడయ్య.

"అసలిది ఎలా జరిగినాదో సరిగ్గా తెలిసే వరకూ ఇంకేటీ జరపడానికి నానూరుకోను" అన్నాడు.


అక్కడున్నోళ్ళంతా పైడయ్య తాతవైపు ఆశ్చర్యంగా చూశారు, ఎలా తెలుసుకోవాలను కుంటున్నాడోనని!

"ఎలా తెలుసుకుంతావురా?" అని అడిగేశాడు లోకేసు.

"కబురెట్టిన మడిసి రానీరా! ఎలా తెలుసుకుంతానో తెలుత్తాది!" అన్నాడు.

"కబురెట్టిన మడిసా?! ఎవ్వడా ఆడు?!..."

"అడిగో ఎలిపొస్తన్నాడు!" అంటూ అల్లంత



# సంస్కృతంలో స్లోగన్లు

స్లోగన్లు అనేవి నేటి రాజకీయాల్లోనూ సామాజిక ఉద్యమాల్లోనూ తరుచు గోచరిస్తూనే ఉంటాయి. కాని స్లోగన్లనేవి పూర్వం కూడా లేకపోలేదు అనవచ్చేమో!

స్వామి వివేకానందుడు ఉపనిషత్తులోనుంచి ఉత్తిష్ఠత! జాగ్రత్త! ప్రాప్యవరాన్ని బోధత అనేది ఒక గర్జనగా మనకి అందించాడు.

ఋగ్వేదంలో చివరి సూక్తంలో రెండు మాటలున్నాయి. అవి ఏనాటికీ మరవరాని విడువరాని స్లోగన్లనే నేను భావిస్తాను.

సంగచ్ఛధ్వం! సంవదధ్వం!

కూడి ఉండండి, కూడి నడవండి అని మొదటి పదానికి అర్థం. కూడి పలకండి అని రెండో పదానికి అర్థం. అందరూ కోరస్‌లా మాట్లాడండి అని కాదు. అందరూ ఏక వాక్యంగా భావైక్యం కలిగి ఉండండి అని అర్థం.

మరొక స్లోగన్ల శ్లోకం ఉంది. దానికి సందర్భం చెప్పుకుంటే కూడా సరదాగానే ఉంటుంది: విక్రమాదిత్యుడు రాజ్యం చేసే కాలంలో శకులు దండయాత్ర చేశారు. వాళ్లను పారద్రోలాలి. అన్నివిధాలా సిద్ధమవుతున్నారు. మహారాజుగారు కవిని పిలిచి మనసైనికుల్నే కాదు, మన పౌరులందర్నీ ఉత్తేజ పరిచేందుకు నినాదాలు ఏవైనా చెప్పండి అన్నాడు.

అప్పుడొక బ్రహ్మాండమైన పౌర సమావేశం జరిగింది.

కవి లేచి పలికాడు— ప్రసారయ ధర్మధ్వజమ్! మహారాజుగారు గంభీర స్వరంతో మళ్లీ ఆ నినాదం చేశారు. కోటి గొంతులు అదే నినాదాన్ని ప్రతినినదించాయి.

మరో పాదం మరో నినాదం

ప్రపూరయ ధర్మ శంఖం!

మహారాజూ ప్రజలూ ప్రతినినదించారు శంఖనాద సహితంగా.

ప్రతాడయ ధర్మదుందుభిం వెంటనే నినాదాలతో పాటు భేరీలు మ్రోగాయి.

ధర్మంకురు ధర్మంకురు ధర్మంకురు ఈ ఆఖరి పాదం జపం వంటిది. ఎల్లరూ ఎల్లప్పుడూ ధర్మం ప్రధానంగా చేసుకుని అన్ని బాధ్యతలూ నిర్వర్తించాలి. యుద్ధమైనా అలాటి ధర్మపరమైన బాధ్యతే.

అందరి సుఖమునూ అందరి మేలునూ కోరి ఈ నినాదాలు చేయబడ్డాయి, —సూరంపూడి భాస్కరరావు

---

దూరంలో ఉన్న 'టీ' కొట్టు ప్రక్కనుంచి వస్తున్నోడ్ని చూపించాడు.

అందరూ అటువైపు చూశారు. చూసి అదిరిపోయారు. భక్తితో చేతులు జోడించి లేచి నిలుచున్నారు పైడయ్య తాతతో సహా!

ఆ వస్తున్నోడు నల్లగా, లావుగా వున్నాడు: గిరజాల జుట్టు, బుగ్గ మీసాలు, చింతనిప్పుల్లా ఖణఖణలాడుతున్న కళ్ళు,నుదుట రూపాయి కాసంత ఎర్రని బొట్టు, మెడలో లావుపాటి పూసల దండలు, ఎర్రని పంచె కట్టుకొని, చేతిలో వేప కొమ్మలతో... ఆ రూపాన్ని చూస్తుంటే చిన్న పిల్లల మాట సరేసరి, పెద్ద వాళ్ళే దడుసుకునేలా ఉంది. అందుకే అక్కడి వాళ్ళంతా లేచి నిలుచున్నారు. ముదుచుకు పోయి బెదురు చూపులతో వణికిపోతున్నారు.

ఆ వచ్చినోడు వచ్చినట్టే ఉండక ఊరు ఊరంతాదద్దరిల్లేటట్టు కేకలు పెడుతూ చిందులు వేస్తున్నాడు. ఏ భాషో తెలియని పదాలు వాడి, మంత్రాలు వేస్తున్నాడు.

"అయ్యా! బూతాలయ్యా. నా మనవరాలు ఎట్టా సచ్చిపోనాదో మంత్రంవేసి తెలును కొండయ్యా!..." అని అర్థించాడు పైడయ్య.

"అలాగేరా!..."అంటూ చేతిలో ఉన్న వేప కొమ్మలతో వాడి వీపు మీద ఛెళ్ళుమని కొట్టి, బూతాలయ్య బూతంలాగే నవ్వాడు. బూతం ఎలా ఉంటుందో ఎవరూ చూడకపోయినా,




వీడ్ని చూస్తే బూతం ఇలాగే ఉంటుంది కాబోలుననేలా ఉన్నాడు వాడు.

వెంటనే వివరాలు అడిగి తెలుసుకున్నాడు బూతాలయ్య. కొంతసేపు పూజచేసి, మంత్రాలు వేసి, ఓ వంద రూపాయల వరకూ దక్షిణ పేరుతో గుంజి, పూజవల్ల ఏదో గ్రహించినట్టు పోజు పెట్టి చెప్పసాగాడు.

"ఈ పిల్లోడు రాత్రి..."

"పిల్లోడు కాదు బాబు, పిల్లది..." గబుక్కున గుర్తుచేసింది బూతాలయ్యకు నీలమ్మ!

ఉలిక్కిపడ్డ బూతాలయ్య సర్దుకుని, "అవునవును... పిల్లది. ఇది రాత్రి ఒంటిగంట మూడు నిముషాలకి సచ్చిపోనాది. మీ ఇంటిలోకి రాత్రి పొద్దుకుంకాక ఎవులొచ్చినారో ఆళ్ళతో గాలొచ్చి, ముందు కోడిపుంజుని, తరవాత ఈ పిల్లదాన్ని నొక్కేసినాది..."

"ఓల్నాతల్లో!" అంటూ మల్లా కూతురి మీదపడి గొల్లుమంది నీలమ్మ.

బూతాలయ్య మాట విని ముఖం చాటు చేసుకున్నాడు కుప్లీగాడు. రాత్రి పొద్దు కుంకాక

ఇంటికి వచ్చింది వాడే! వాడివైపు కోపంగా చూశాడు పైడయ్య.

బూతాలయ్య మరలా అరిచాడు.

"ఆ గాలి ఇంకా ఇక్కడే ఉంది. దానిని నానిప్పుడు తీసుకెళ్లిపోయి, సాసీనాలకాడ పూజ సేసి గొయ్యితీసి కప్పేత్తాను," అంటూ మంత్రాలు చదివి, ఆ పిల్ల తల వెంట్రుకలు కోసి, కోడిపుంజువి రెండు ఈకలు లాగి వాటిని పట్టుకుని వెళ్ళిపోయాడు, చిందులు వేస్తూ బూతాలయ్య!

అప్పటి వరకూ బిగుసుకుపోయి ఉన్న వాళ్ళంతా గుండెల నిండా ఒక్కసారి గాలి పీల్చుకున్నారు, ఇక బెంగలేదని ఆనందపడిపోతూ!

పైడయ్య తాత అందరివైపూ గర్వంగా తల ఎత్తి చూశాడు, 'చూశారా ఎవళ్ళకీ చెప్పకుండా అసలు రహస్యాన్ని ఎలా తెలుసుకున్నానో! ఎంతటి ఘనకార్యాన్ని సాధించానో!' అన్నట్టు!...

ఇంతకూ అసలు జరిగిందేమిటో ఎవరికీ తెలియదు.

రాత్రి పన్నెండు పండక్కి వెళ్ళి అక్కడ స్నేహితులతో తప్పతాగి వచ్చిన కుష్లీగాడు, గుడిసెలోకి జొరబడబోయి... తాగి ఉన్న మైకంలో తూలి ఆ ప్రక్కనే ఉన్న కోలబుట్ట మీద పడిపోయాడు. అందులో తల దించుకుని నిద్రపోతున్న కోడిపుంజు శాశ్వత నిద్రలోకి పోయింది. కిక్కురుమనకుండా చనిపోయింది. ఆ నిషాలో ఏం జరిగిందో కుష్లీగాడికి తెలియలేదు. మెల్లగా లేచి గుడిసెలోకి వెళ్ళిపోయాడు. నేలమీద గుడ్డ పరుచుకుని నీలమ్మ నిద్రపోతూంది. పక్కనే నులక మంచంలో పిల్లది నిద్రపోతూంది. దాని ప్రక్కనే పడుకుండిపోయాడు కుష్లీగాడు. ఆ నిద్రలో... అటూ ఇటూ వత్తిగిల్లి, చేతికి తగిలిన కూతుర్ని గట్టిగా కౌగలించుకున్నాడు, ప్రేమ ఎక్కువయిపోయినట్లు!..

అంతే!... అలా ఎంతసేపు కౌగిలించుకున్నాడో, కూతురిపై ఎంత ప్రేమ కురిపించాడో అసలు కురిపించాడో లేదో కుష్లీగాడికి తెలియదు. సుషుప్తిలో ఉన్న నీలమ్మకీ తెలియదు...

ఎవరికీ తెలియదు.
అప్పుడే జరిగింది పొరపాటు!
ఆ పొరపాటు పేరే!......
గాలి!...

## ప్రకృతి నైజం

అందకుండా వున్న
ఆకాశాన్ని చూస్తుంటే
అవనికెప్పుడూ అసూయే!
అందుకే—
తరువుకు తనువిచ్చి
అది—
మింటినంటితే చూడాలని
ముచ్చటపడుతుంది!
ఒంటికాలిపైన
ఎన్నేళ్ళు తపస్సు చేసినా
లక్ష్యం చేరని వృక్షం కూలిపోతే
అక్కున చేర్చుకుని
నిరాశగా నిట్టూరుస్తుంది పుడమి!

—అద్దేపల్లి భరత్‌కుమార్


# మంట • దురద • రక్తం కారడం
# మూల వ్యాధికి మొదటి లక్షణాలు.

వెంటనే చికిత్సను మొదలెట్టండి.
ఆపరేషన్ చేసే పరిస్థితిని రానియ్యకండి.

మూలవ్యాధి సాధారణంగా వచ్చే వ్యాధి. కాని అశ్రద్ధ చెయ్యడం వల్ల అది ముదిరిపోవచ్చు. అప్పుడిక ఆపరేషన్ చెయ్యవలసి రావచ్చు.

మూలవ్యాధికి ప్రభావంతో పనిచేసే చికిత్స, ప్రెపరేషన్-హెచ్★. దీన్ని విదేశాల్లోని ప్రముఖమైన డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

ప్రెపరేషన్-హెచ్ ఔషధయుక్తమైన మలాము, అద్వితీయమైన ఫార్ములా— త్వరగా ఆ బాధ, దురదా నుంచి ఉపశమనం యిచ్చి, నిజానికిది వాపును తగ్గించి మొలలుగల కండరాలను ముడుచుకుపోయేలా చేస్తుంది. ప్రెపరేషన్-హెచ్, అక్కడ జారుడు చేసి, సుఖ విరోచనం అయ్యేలా చేస్తుంది.




* Licensed user of TM. Geoffrey Manners & Co. Ltd.

GM-PH-84-TL